
జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 84 6-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## నీటి సంరక్షణ బాధ్యత అందరిదీ

- 100 రోజుల కార్యాచరణ.. సాగునీటి సంఘాలకు కీలక బాధ్యతలు
- పక్కా ప్రణాళికతో పనులు.. జులై 14 డెడ్‌లైన్
- అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో.. భూగర్భ జలాల పెంపే లక్ష్యం
- పూడికతీత నుంచి వాటర్ బడ్జెట్ వరకు.. చేయాల్సిన పనులివే
- కరవు రహిత రాష్ట్రమే ధ్యేయం.. ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి

రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా నేడు రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే 100 రోజుల ప్రణాళికపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, సీఎం చంద్రబాబు రేపు (ఏప్రిల్ 6) తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. నీటి భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని,





## అగ్రరాజ్యానికి మరో ఎదురుదెబ్బ

**రెండు ఎంసీ130జే విమానాలు ధ్వంసం ఎయిర్‌మ్యాన్‌ను కాపాడే క్రమంలో భారీ నష్టం**

టెహ్రాన్/దుబాయ్: ఇరాన్ యుద్ధంలో అమెరికాకు భారీ ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలు యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను నష్టపోయిన అగ్ర రాజ్యం తాజాగా మరో రెండు ఎంసీ130జే రవాణా విమానాలను కోల్పోయింది! శుక్రవారం ఇరాన్‌లో నేలకూలిన ఎఫ్15ఇ ఫైటర్ జెట్ తాలూకు ఎయిర్‌మ్యాన్‌ను కాపాడుకునేందుకు చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో ఈ ఉదంతం చోటుచేసుకుంది. ఆపరేషన్ అనంతరం ఇరాన్ నుంచి వెనక్కు మళ్లే క్రమంలో రెండు ఎంసీ130 జే విమానాలు మొరాయించినట్టు సమాచారం. దాంతో ఇరాన్‌కు చిక్కొద్దనే ఉద్దేశంతో అమెరికా దళాలే వాటిని పేల్చేసినట్టు అమెరికా సైనికాధికారి ఒకరు తెలిపారు. శత్రు భూభాగంలో రహస్యంగా ప్రవేశించడానికి, అక్కడ చిక్కిన తమవారిని కాపాడేందుకు ఈ రవాణా విమానాలను అమెరికా ఉపయోగిస్తుంటుంది. మంటల్లో కాలి నేలకూలిన అమెరికా రవాణా విమానాల అవశేషాలను ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ ఖలిబాఫ్

## అన్ని మతాల ప్రజల దేవాలయం ఈ న్యాయాలయం

- నూతన హైకోర్టు జోన్2 భవన నిర్మాణ పనులకు సీజేఐ భూమిపూజ
- ఈ కార్యక్రమం లాంఛనం కాదు.. రాజ్యాంగ విధి
- కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు సమాంతరంగా సాగడం సరైనదే
- తెలంగాణ వచ్చాక దశాబ్ద కలకు కార్యరూపం ఈ భవన నిర్మాణం
- రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని అభినందించిన సీజేఐ
- అన్ని మతాల ప్రజల దేవాలయం ఈ న్యాయాలయం
- కొత్త హైకోర్టు నిర్మాణం ప్రభుత్వానికి గౌరవప్రదమని వెల్లడి

హైదరాబాద్: రాజ్యాంగం సజీవంగా ఉండాలంటే న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు ఒకే లక్ష్యంతో పనిచేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నిర్మించే నూతన హైకోర్టు జోన్2 భవన నిర్మాణ పనులకు ఆదివారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్వీ భట్టి, జస్టిస్ అలోక్ అరాధే, హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తో కలసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం సీజేఐ మాట్లాడారు. ఈ కార్యక్రమం లాంఛనం కాదని.. రాజ్యాంగ విధి అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత దశాబ్ద కల కార్యరూపం దాలుస్తోందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వ సహకారం అభినందనీయమన్నారు.

మిగతా 2లో







## తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనం

- బీఆర్ఎస్ హయాంలోనే దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ చిరునామాగా మారింది
- ఏఐ, లైఫ్ సైన్సెస్, ఫిన్‌టెక్, అగ్రిటెక్ సమ్మేళనంతోనే వృద్ధి
- కొలంబియా బిజినెస్ స్కూల్ 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్

## జగన్... రాష్ట్రానికి పట్టిన చీడ

**వికేంద్రీకరణ పేరుతో చారిత్రక తప్పిదం**

**అమరావతి.. ఐదు కోట్ల మంది ఆత్మగౌరవం**



## ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...

**అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ**

భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం



## పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్‌రాజ్

- చొరబాటుదార్లను ఓటు బ్యాంకుగా మార్చుకున్న సీఎం మమత
- మేము అధికారంలోకి రాగానే వారిని బయటకు పంపిస్తాం
- బెంగాలీలు తలెత్తుకొని జీవించేలా చేస్తామన్న ప్రధాని



# జగన్... రాష్ట్రానికి పట్టిన చీడ

"గ్రామాల్లో శుభకార్యాల సమయంలో అమంగళకరమైన పేర్లు పలకకూడదని ఒక సంప్రదాయం ఉంటుంది. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'జగన్' అనే పేరు కూడా అలాంటిదే" అంటూ రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ అనుసరించిన వైఖరి రాష్ట్రానికి తీరని నష్టం చేసిందని, ఆయనొక అభివృద్ధి నిరోధక శక్తి అని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తన కొత్త రాజధాని ప్రతిపాదనతో రాష్ట్ర ప్రజల ముందు నవ్వులపాలయ్యారని, సొంత పార్టీ శ్రేణులే ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. రాష్ట్రానికి రాజధాని నిర్మాణం ఒక గొప్ప సంబరం లాంటిదని, అలాంటి సమయంలో జగన్ 'కంటిలో నలుసులా', 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా' తయారయ్యారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలిపితే, ఒక్క వైసీపీ మాత్రమే పార్లమెంటులో వాకౌట్ చేసి రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టిందని గుర్తుచేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాల్సిన రాజధాని విషయంలో జగన్ వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని విమర్శించారు. ఆయన పాలనలో రాష్ట్రం ఐదేళ్ల పాటు చీకటి రోజులను చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019-24 మధ్య జగన్ చెప్పిన 'అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదం శుద్ధ అబద్ధమని పార్థసారథి స్పష్టం చేశారు. "అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు ప్రకటించి, అధికారంలోకి రాగానే మాట మార్చారు. సూట్‌కేసు రాజకీయాలు చేస్తూ రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారు. ప్రజలు ఈ నాటకాన్ని గమనించి, మూడు రాజధానుల ఆలోచనను ఛీత్కరించి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు. చేసిన తప్పులను ఒప్పుకోకుండా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా తన ఆలోచనలనే రుద్దే నియంతలా జగన్ వ్యవహరించారని మండిపడ్డారు. రాజధాని పేరును 'మావిగన్'గా మార్చాలని చూడటం ఆయన 'తుగ్లక్' పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. విభజనతో నష్టపోయిన ఆంధ్రులకు అమరావతి ఒక ఆత్మగౌరవ ప్రతీక అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. "ఏ నాయకుడూ చేయలేని సాహసాన్ని చంద్రబాబు చేశారు. ఆయన ఒక్క పిలుపుతో రైతులు 34,000 ఎకరాల విలువైన భూములను రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్'. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణకు లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తోంది. అదే స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందితే, ఏటా వచ్చే 4-5 లక్షల కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోని ప్రతీ మూలను అభివృద్ధి చేయవచ్చు" అని వివరించారు. అమరావతిలో పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆయన స్పష్టం చేశారు.

# పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్‌రాజ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 'మహా జంగిల్‌రాజ్'ను నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాష్ట్రంలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలు అధికార పార్టీ సృష్టించిన భయానికి, బీజేపీ ఇస్తున్న భరోసాకు మధ్య జరుగుతున్నాయని తేల్చిచెప్పారు. ఆదివారం ఉత్తర బెంగాల్‌లోని కూచ్‌బెహార్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. మాల్దా జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులపై అల్లరి మూకలు దౌర్జన్యానికి దిగి, నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. తృణమూల్ కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. చొరబాటుదార్లను ఇక్కడి పాలకులు ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ ప్రోద్బలంతోనే పొరుగుదేశం నుంచి జనం అక్రమంగా వలస వస్తున్నారని, దాంతో స్థానికంగాజనాభా నిష్పత్తిలో విపరీతమైన మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. చొరబాటుదార్ల వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. జ్యుడీషియల్ అధికారులకు కూడా రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ అరాచక ప్రభుత్వం ప్రజలను కాపాడుతుందన్న విశ్వాసం లేదని తేల్చిచెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ మహా జంగిల్‌రాజ్‌కు మాల్దా ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. బెంగాల్‌లో శాంతి భద్రతలకు అంత్యక్రియలు నిర్వహించడానికి అధికార పార్టీ కంకణం కట్టుకుందని దుయ్యబట్టారు. కట్‌మనీ, అవినీతికి మారుపేరైన తృణమూల్ కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని, అభివృద్ధి చేసి చూపించే బీజేపీని గెలిపించాలని బెంగాల్ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక అక్రమ వలసలను కచ్చితంగా అడ్డుకుంటామని, చొరబాటుదార్లను బయటకు పంపిస్తామని హామీ ఇచ్చారు. మారుతున్న జనాభా నిష్పత్తి కారణంగా సొంత గడ్డపై స్వేచ్ఛను కోల్పోతామనే భయం ప్రజల్లో ఉందన్నారు.

# ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...

కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి



సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అగ్రరాజ్యానికి మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

'ఎక్స్'లో షేర్ చేశారు. 'అమెరికా గనుక ఇలాంటి మరో మూడు విజయాలు సాధిస్తే అది పూర్తిగా నాశనమవుతుంది' అని ఎద్దేవా చేశారు. రెస్క్యూ ఆపరేషన్ సందర్భంగా పలు అమెరికా విమానాలను నేలకూల్చినట్టు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. దక్షిణ ఇస్ఫహాన్‌లో మరో సీ130 రవాణా విమానంతో పాటు రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను ధ్వంసం చేసినట్లు ఇరాన్ పోలీసు కమాండ్ ప్రకటించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఆదివారం భీకర స్థాయిలో దాడులకు దిగినట్టు ట్రంప్ వెల్లడించారు. వాటిలో పలువురు అగ్రశ్రేణి సైనికాధికారులు హతమయ్యారన్నారు. భారీ పేలుళ్లు కనిపిస్తున్న ఒక వీడియోను ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. తమతో ఒప్పందం కుదుర్చుకోవడంలో గానీ, హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంలో గానీ ఇరాన్ విఫలమైతే భయంకరమైన పరిణామాలకు సిద్ధంగా ఉండాలని ట్రంప్ తేల్చిచెప్పారు. పశ్చిమాసియా యుద్ధం ఆరో వారంలోకి ప్రవేశించింది. ఇజ్రాయెల్‌అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు నిర్నిరోధంగా కొనసాగుతూనే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. ఆదివారం గల్ఫ్ దేశాల్లోని ఇంధన మౌలిక సదుపాయాలపై భీకర దాడులకు దిగింది. కువైట్, యూఏఈ, బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. దాడుల్లో కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ (కేపీసీ)కు చెందిన పలు యూనిట్లు దెబ్బతిన్నాయి. మంటలను ఆర్పడానికి అత్యవసర బృందాలను రంగంలోకి దించాల్సి వచ్చింది.

ఇరాన్ చమురు, కేపీసీ ప్రధాన కార్యాలయాలున్న షువైఖ్ ఆయిల్ సెక్టార్ కాంప్లెక్స్‌పైనా క్షిపణి దాడులు జరిగాయి. అయితే ప్రాణనష్టం వాటిల్లలేదని కువైట్ మీడియా పేర్కొంది. గల్ఫ్‌లో విద్యుత్ ప్లాంట్లు, నీటి శుద్ధి కేంద్రాలను సైతం ఇరాన్ టార్గెట్‌గా మార్చుకుంది. కువైట్‌లో రెండు పవర్ ప్లాంట్లను మూసివేయాల్సి వచ్చింది. అబూదాబీలోనూ ఇరాన్ దాడులు కొనసాగాయి. క్షిపణుల శకలాలు నేలకూలడంతో పెట్రో కెమికల్ కేంద్రాలు మంటల్లో చిక్కుకున్నాయి. అక్కడ ఉత్పత్తి ఆగిపోయింది. బహ్రెయిన్‌పైనా ఇరాన్ నిప్పుల వర్షం కురిపించింది.

### గల్ఫ్ అంతా బుగ్గే: ఇరాన్

ట్రంప్ బూతు పురాణంపై ఇరాన్ మండిపడింది. "ఇలాంటి వ్యాఖ్యల ద్వారా సంక్షోభాన్ని ట్రంప్ మరింత పెంచుతున్నారు. గల్ఫ్ అంతా భస్మీపటలమయ్యే పరిస్థితులను కల్పిస్తున్నారు" అని దుయ్యబట్టింది. ట్రంప్ పిల్ల చేష్టలు, వ్యాఖ్యలతో అమెరికాను ఊహించిన దానికంటే వేగంగా రాతియుగంలోకి తీసుకెళ్లారంటూ ఎద్దేవా చేసింది. ఇరాన్‌ను ఓడించామన్న భ్రమే ఓ బురదగుంటగా మారి అందులో అమెరికా కూరుకుపోవడం ఖాయమని ఇరాన్ సెంట్రల్ మిలటరీ కమాండ్ జనరల్ అలీయాబాదీ అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలు ఇస్లాంను కించపరిచేలా ఉన్నాయని అమెరికాలోని కౌన్సిల్ ఆన్ అమెరికన్‌ఇస్లామిక్ రిలేషన్స్ ఆక్షేపించింది.



# అన్ని మతాల ప్రజల దేవాలయం ఈ న్యాయాలయం

మౌలిక సదుపాయాల కల్పన తప్పనిసరి..: 'న్యాయవ్యవస్థలో నా సుదీర్ఘ వృత్తి జీవితంలో నేను ఒకటి నమ్ముతాను. ప్రతి కార్యానికి మూడు దశలు ఉంటాయి. ప్రారంభం ఉద్దేశాన్ని వెల్లడిస్తుంది. మధ్యభాగం పట్టుదలను ప్రదర్శిస్తుంది. ముగింపు వాగ్దానం నెరవేరిందా లేదా అనేది తెలియజేస్తుంది. ప్రజలంతా న్యాయపీఠం, చిహ్నం, కార్యకలాపాలను మాత్రమే చూస్తారు. అదే మనకు కనిపించే న్యాయవ్యవస్థ. కానీ ప్రతి కోర్టు గది వెనుక దాన్ని నడిపించే ఓ ప్రపంచం ఉంటుంది. అక్కడే న్యాయమూర్తులు నివసిస్తారు.. శిక్షణ పొందుతారు.. తీర్పులు భద్రపరుస్తారు.. ఈరోజు దానికి మనం పునాది వేస్తున్నాం. మనం ఇక్కడికి రావడం లాంఛనం కాదు.. రాజ్యాంగ విధి. న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలన్న సూత్రాన్ని రాజ్యాంగ నిర్మాతలు విశ్వసించారు. ప్రతి రాష్ట్రంలో ఓ హైకోర్టు ఏర్పాటు చట్టపరమైన అవసరమే కాకుండా గణతంత్ర రాజ్య నిబద్ధతగా ఎప్పుడూ భావిస్తాను. దఅలాంటి నిబద్ధతకు.. అందుకు ఆధారమైన మౌలిక సదుపాయాలు ఉన్నంత వరకే అర్థం ఉంటుంది. అది లేకుంటే కేవలం కాగితాల్లోనే మిగిలిపోతుంది. తెలంగాణలో అది నిర్దిష్ట రూపాన్ని సంతరించుకుంటోంది. జోన్1లో పనులు చురుగ్గా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ భవనాలు ఓపక్క రూపుదిద్దుకుంటుండగానే జోన్2 మొదలవుతోంది. న్యాయవ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాయి. అది సరైనదే. ప్రస్తుత భవనం చారిత్రాక కట్టడం అయినప్పటికీ ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదు. రాబోయే వందేళ్ల అవసరాలు తీర్చే మౌలిక సదుపాయాలను కల్పించడం ఓ లక్ష్యం మాత్రమే కాదు.. తప్పనిసరి. కోర్టు గదులతోపాటు జోన్2 కూడా అంతే ముఖ్యం. చెట్టులో మనకు కొమ్మలు, ఎత్తు మాత్రమే కనిపిస్తాయి. కానీ తుపాను వచ్చినప్పుడు వేర్లు మాత్రమే దాన్ని కాపాడతాయి. జోన్2 న్యాయవ్యవస్థకు వేర్లలాంటిది'అని పేర్కొన్నారు. 'హైకోర్టు రోజువారీ కార్యకలాపాలు తన నియంత్రణలో లేని ఏర్పాట్లపై ఆధారపడి ఉంటుంది. ఈ 100 ఎకరాల ప్రాంగణం ఆ పరిస్థితిని మారుస్తుంది. సంస్థాగత స్వయం సమృద్ధిని సిద్ధాంతం నుంచి ఆచరణలోకి తీసుకొచ్చినప్పుడు అది ఇలానే కనిపిస్తుంది. ఇక్కడ నిర్మించబోయే ఆడిటోరియంలో న్యాయవ్యవస్థకు శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించడం శుభ పరిణామం. సెంట్రల్ రికార్డ్ రూమ్.. తీర్పులను భద్రపర్చడం అత్యంత ప్రాధాన్యం. ప్రస్తుత హైకోర్టులో 2009లో చోటుచేసుకున్న ఓ అగ్నిప్రమాదం కొత్త భవన నిర్మాణానికి బీజం వేసింది. ఫుల్ కోర్టు ఆమోదం, హైకోర్టు చీఫ్ జస్టిస్‌ల ప్రస్తావనతో దశాబ్దం తర్వాత కార్యరూపం దాల్చింది. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాలు న్యాయ వ్యవస్థకు సదుపాయాల కల్పనకు ముందు వస్తున్నాయి. అత్యంత అవశ్యకం అని గుర్తిస్తున్నాయి.

# తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనం



హైదరాబాద్: భారతదేశంలో అత్యంత విజయవంతమైన 'స్టార్టప్ స్టేట్'తెలంగాణ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనమని చెప్పారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో జరిగిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ సాధించిన ప్రగతిని వివరించారు. సుదీర్ఘ పోరాటం ద్వారా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. 'మేము అవకాశాల కోసం ఎదురుచూడలేదు. వాటిని అందిపుచ్చుకోవడానికి అద్భుతమైన పాలసీలను తయారు చేశాం. మౌలిక సదుపాయాలను కల్పించాం. తద్వారా పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధిని సాధించాం'అని కేటీఆర్ వివరించారు. 2027లో భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమవుతున్న వేళ కేవలం పదేళ్లలోనే తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతి గర్వకారణమన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని నడిపే నాయకత్వానికి స్పష్టత ఉంటే జవాబుదారీతనం పెరుగుతుందని.. తద్వారా అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారు. భవిష్యత్తు గురించి కేవలం మాటలు చెప్పడం కంటే, దానిని మనమే సృష్టించడం ఉత్తమమైన మార్గమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. భారతదేశ సమాఖ్య స్ఫూర్తిని కేటీఆర్ ప్రస్తావిస్తూ దేశాభివృద్ధి కేవలం ఒకే రకమైన విధానాల వల్ల కాకుండా ప్రతి రాష్ట్రం తనకున్న ప్రత్యేక బలాలను వినియోగించుకోవడం ద్వారా సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. 'భారత్ 28 ఇంజన్లుగల ఒక ఫార్ములా1 రేసింగ్ కార్ లాంటిది. ప్రతి రాష్ట్రం తనదైన శైలిలో అభివృద్ధి చెందుతూ దేశ ప్రగతికి తోడ్పడాలి. అంతర్జాతీయ పెట్టుబడి నిర్ణయాలు చివరికి రాష్ట్రాలు, నగరాల స్థాయిలోనే జరుగుతాయి'అని కేటీఆర్ గుర్తుచేశారు.

# నీటి సంరక్షణ బాధ్యత అందరిదీ

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. "ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి, ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను పెంచాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటి సంఘాలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నీటి భద్రతను సాధిస్తే మిగిలిన అన్ని రంగాల్లో అభివృద్ధి దానంతట అదే సాధ్యమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ 100 రోజుల కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను ప్రకటించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రణాళికను రూపొందించారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపులో అన్నమయ్య జిల్లా సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. 'జలధార' పేరుతో ఆ జిల్లాలో చేపట్టిన చర్యలు అద్భుత ఫలితాలనిచ్చాయని, స్థానిక జలవనరులను వినియోగించుకుని, చెరువులను నింపి భూగర్భ జలాలను గణనీయంగా పెంచారని కొనియాడారు.

# బడుగుల బాంధవుడు బాబూ జగ్జీవన్ రామ్

**- పురపాలక కార్యాలయంలో నివాళులర్పించిన కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య**



**తొలివెలుగు, చౌటుప్పల్:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం చౌటుప్పల్ పురపాలక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప పరిపాలనా దక్షుడిగా జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. ఐదు దశాబ్దాల పాటు పార్లమెంటు సభ్యుడిగా ఉంటూ పేదల అభ్యున్నతికి ఆయన ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్

- ఘనంగా 119వ జయంతి వేడుకలు
- జూలూరులో విగ్రహావిష్కరణ చేసిన ప్రభాకర్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జూలూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాడుగుల ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో జగ్జీవన్‌రామ్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. మున్సిపల్ కేంద్రంలో జగ్జీవన్‌రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, సర్పంచ్ కాసుల అంజయ్య, ఉపసర్పంచ్ దాసరి నరసింహ, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పోతగళ్ళ దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరించండి

- మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లకు నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సన్మానం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** స్థానిక నల్ల పోచమ్మ దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, 13వ వార్డు కౌన్సిలర్ సూరపల్లి రాధిక రమేష్‌లను ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్కూరి పాండురంగం గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి, దేవి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. పట్టణంలోని పురాతన నల్ల పోచమ్మ ఆలయ అభివృద్ధికి మున్సిపాలిటీ తరపున ప్రత్యేక కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డబ్బికారు సాహెష్, భోగ చంద్రశేఖర్, మంగళపల్లి రాజా రమేష్, ప్రధాన కార్యదర్శి బొడిగ లింగం గౌడ్, కోశాధికారి మాటూరు రామకృష్ణ, సహాయ కార్యదర్శి బొడిగ బాబు, గౌరవ అధ్యక్షులు కోయడ నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిబ్లాక్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో 'బొడ్రాయి' పండుగ

- ముగిసిన నాభి శిల తృతీయ వార్షికోత్సవ వేడుకలు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని జిబ్లాక్‌పల్లి గ్రామంలో ఆదివారం గ్రామ నాభి శిల (బొడ్రాయి) తృతీయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ దేవతకు ఊరి జనం భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు తమ బంధుమిత్రులను ఆహ్వానించి, మహిళలు సాంప్రదాయబద్ధంగా ఒడిబియ్యం పోసి బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆర్ల కావ్య వెంకటేష్ యాదవ్, ఉప సర్పంచ్ ఆర్ల లింగస్వామి యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర నాయకులు పోచంపల్లి రమణ రావు, వార్డు సభ్యులు ముమ్మిడి నరసింహ చారి (రాజు), మీసాల నర్మదా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌కు ఐదు పతకాలు ఖాయం


ఉలాన్‌బాటర్ (మంగోలియా): ఆసియా సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో ఐదు పతకాలు ఖాయమయ్యాయి. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్స్ జైస్మీన్ లంబోరియా (57 కేజీలు), మీనాక్షి హుడా (48 కేజీలు)... పురుషుల విభాగంలో లోకేశ్ (85 కేజీలు), ఆకాశ్ (75 కేజీలు), హర్ష్చౌధరీ (90 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. తద్వారా కనీసం కాంస్య పతకాలను ఖరారు చేసుకున్నారు. జియి చెన్ (చైనా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో జైస్మీన్ 50తో... యుకా సదమత్సు (జపాన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో మీనాక్షి 50తో ఏకపక్ష విజయాలు అందుకున్నారు. లోకేశ్ 50తో గిచాయి కిమ్ (దక్షిణ కొరియా)పై, ఆకాశ్ 50తో యాలాస్ బగ్తియరోవ్ (తుర్క్‌మెనిస్తాన్)పై, హర్ష్50తో తినిస్తాన్ అలీబయెవ్ (కిర్గిస్తాన్)పై గెలుపొందారు.

# యాదాద్రికి పోటెత్తిన భక్తజనం



- సెలవు వేళ.. ఆధ్యాత్మిక పరవశంలో క్షేత్రం
- దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉన్న భక్తులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వరుస సెలవుల నేపథ్యంలో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. కొండపైన ఆలయ పరిసరాలు, మాడ వీధులు భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రద్దీ పెరగడంతో ధర్మ దర్శనానికి గంటల సమయం పట్టింది. తీవ్రమైన ఎండ దృష్ట్యా క్యూలైన్లలో వేచి ఉన్న చిన్నపిల్లలు, వృద్ధులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. కొండ కింద విష్ణు పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వసతి గదులు పూర్తిగా నిండిపోవడంతో చాలామంది భక్తులు చెట్ల నీడన సేదతీరారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించి తమ గమ్యస్థానాలకు తిరుగుముఖం పట్టారు.





# బ్రిడ్జి పనుల్లో జాప్యం.. ప్రయాణికుల అవస్థలు





- డైవర్షన్ రోడ్డును వెంటనే పునరుద్ధరించాలి: కల్లూరి రామచంద్రారెడ్డి

**తొలివెలుగు, రాజపేట:** మండలంలోని పొట్టిమర్రి వాగు వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండటంపై బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి రామచంద్రారెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన పార్టీ మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్‌తో కలిసి వాగు వద్ద తెగిపోయిన డైవర్షన్ రోడ్డును, నిలిచిపోయిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజపేట నుంచి యాదగిరిగుట్ట వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మాటలతోనే కాలయాపన చేయకుండా, అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన డైవర్షన్ రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలన్నారు. అలాగే మండలంలోని చెరువులన్నింటినీ నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు ఎర్ర గోకుల జస్వంత్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పల్లె సంతోష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బెడద వీరేశం పాల్గొన్నారు.

# మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలి

- రాజపేటలో జగ్జీవన్‌రామ్, జ్యోతిరావ్ పూలే విగ్రహాల ఆవిష్కరణ
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్



**తొలివెలుగు, రాజపేట:** దేశం కోసం నిస్వార్థంగా పనిచేసిన మహనీయుల చరిత్రను, వారి ఆశయాలను భావితరాలకు అందించేలా విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్‌గౌడ్ అన్నారు. ఆదివారం రాజపేట మండల కేంద్రంలోని నవభారత్ కాలనీలో నవభారత్ యూత్ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాలను వారు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే, జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని, వారు కలలుగన్న సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు స్థానిక వివేకానంద విగ్రహ కూడలి నుంచి విగ్రహావిష్కరణ వేదిక వరకు యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటుకు కృషి చేసిన నవభారత్ కాలనీ యూత్ సభ్యులను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సామూహిక భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోయ మధు, ఉప సర్పంచ్ నెమిల కేదారిగౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్ సంధిల భాస్కర్‌గౌడ్, వివిధ పార్టీల మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మేకల రమేష్, దాచేపల్లి రాజు, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు జూకంటి ప్రవీణ్‌కుమార్, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



## అగ్నికాహుతైన ఆశలు.. బూడిదైన నీలగిరి

- నమిలలో రూ.3 లక్షల విలువైన పంట నష్టం
- అధికారులు ఆదుకోవాలని బాధిత రైతుల వేడుకోలు



**తొలివెలుగు, రాజపేట:** మండలంలోని నమిల గ్రామ రెవెన్యూ పరిధిలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సర్వే నంబర్ 84లో సాగు చేసిన సుమారు నాలుగెకరాల నీలగిరి (యూకలిప్టస్) తోట ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. ఈ ఘటనలో దాదాపు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ధర్మ రంగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, హరినాథ్ రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట కళ్లెదుటే అగ్నికి ఆహుతి కావడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వక చర్యల వల్లే ఈ అనర్థం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నష్టాన్ని అంచనా వేసి తమను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా బీరప్ప స్వామి ఆలయ శంకుస్థాపన

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత
- కాచారంలో ఆధ్యాత్మిక సందడి



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** మండలంలోని కాచారం గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కురుమల ఆరాధ్య దైవం బీరప్ప స్వామి కామరతి దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఆమెకు స్వాగతం పలికారు. శంకుస్థాపన అనంతరం ఆమె మాట్లాడుతూ.. భక్తి మార్గం మనిషికి ప్రశాంతతను ఇస్తుందని, అటువంటి పవిత్రమైన ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. కురుమ సోదరుల ఐక్యతను ఆమె అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కురుమ సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## జగ్జీవన్‌రామ్‌కు 'భారతరత్న' ప్రకటించాలి

- ఘనంగా 119వ జయంతి వేడుకలు.. నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్‌కు దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో చంద్రస్వామి మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాల పాటు ప్రజా ప్రతినిధిగా, కేంద్ర మంత్రిగా జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు అనన్యసామాన్యమన్నారు. అనేక శాఖలకు వన్నె తెచ్చిన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఇంతటి మహనీయుడికి ఇప్పటికీ భారతరత్న ఇవ్వకపోవడం విచారకరమని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయనకు తగిన గౌరవం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బూడిద జానీ మాదిగ, మండల అధ్యక్షుడు ఆకారపు లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ బూడిద మధు తదితరులు పాల్గొన్నారు.

## చేతగాకనే.. క్యాంప్ ఆఫీసులపై దాడులు

- గజ్వేల్ ఘటనను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ శ్రేణులు
- సీఎం రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన మండల అధ్యక్షుడు చందర్ గౌడ్



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** గజ్వేల్‌లోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేయడాన్ని బీఆర్ఎస్ ఆత్మకూరు (ఎం) మండల శాఖ తీవ్రంగా ఖండించింది. ఇదొక పిరికిపంద చర్య అని మండల పార్టీ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ మండిపడ్డారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కేవలం కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. కేసీఆర్ 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు కాబట్టే, నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగలిగారని ఆయన గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అయితే రేవంత్ రెడ్డికి ఈ గుర్తింపు దక్కేది కాదన్నారు. కాంగ్రెస్ హయాంలో 1969లో ఎంతోమంది విద్యార్థులు బలికాగా, కేసీఆర్ మాత్రం శాంతియుతంగా రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. కేసీఆర్ ఫోటో చూస్తే కాంగ్రెస్ నాయకులకు ఎందుకు అంత ఉలుకు అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, జిల్లా నాయకులు కోరే బిక్షపతి, శ్రీనివాస్ రెడ్డి, లోడి శ్రీనివాస్ గౌడ్, రంగ సత్యనారాయణ గౌడ్, నాతి రాజు గౌడ్, గట్టు శంకర్, వార్డు సభ్యుడు విశాల్, కోరే బీరప్ప, మజ్జిగ రాంబాబు, బూడిద వెంకన్న, లోడి మధు, కదిరే దశరథ, కొమ్మురాజుల శ్రీను, పంజాల రాజు, మల్గ క్రాంతి, నాతి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉపసర్పంచ్ తనయులు

- వెల్లంకిలో ఆదర్శంగా నిలిచిన మిర్యాల రాజ్‌కుమార్ దంపతులు
- ఘనంగా బడిబాట కార్యక్రమం.. బాబూజీకి నివాళులు

**తొలివెలుగు, రామన్నపేట :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా సాగుతున్న 'బడిబాట' కార్యక్రమంలో వెల్లంకి ఉపసర్పంచ్ మిర్యాల రాజ్‌కుమార్ ఆదర్శంగా నిలిచారు. ఆదివారం ఆయన తన పిల్లలను వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో చేర్పించి గ్రామస్తులందరికీ కొత్త బాట చూపారు. అంతకుముందు పాఠశాలలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, గ్రామ ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ రాజ్‌కుమార్ దంపతులను కలిసి ప్రభుత్వ పాఠశాలలోని సౌకర్యాలను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన రాజ్‌కుమార్, తన పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా సాయంత్రం వరకు గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి, ఏపీసీ చైర్ పర్సన్ పులగం సులోచన, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ కర్రే రాజు, ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, మందుగుల వెంకటయ్య, నకిరేకంటి అశ్విని తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి







- సమాన అవకాశాల రూపశిల్పి బాబూ జగ్జీవన్ రామ్
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- ఘనంగా 119వ జయంతి వేడుకలు.. నివాళులర్పించిన అధికారులు

**తొలివెలుగు, భువనగిరి:** సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్లాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ చౌరస్తా (ప్రిన్స్ కార్నర్, రైతు బజార్ ఎదురుగా) వద్ద షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డిలు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏప్రిల్ నెల మహనీయుల మాసమని, ఏటా బాబూ జగ్జీవన్ రామ్, జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతులను స్ఫూర్తిదాయకంగా జరుపుకుంటామన్నారు. దళితులకు సమాన అవకాశాలు కల్పించిన ఘనత జగ్జీవన్ రామ్‌కే దక్కుతుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, పరిపాలనా దక్షుడిగా మూడు దశాబ్దాల పాటు ఉప ప్రధాని, కేంద్ర మంత్రి హోదాల్లో ఆయన అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకా రెడ్డిలు మాట్లాడుతూ.. 1971 యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా ఆయన చూపిన తెగువ, వ్యవసాయ శాఖ మంత్రిగా దేశంలో ఆకలి చావులు లేకుండా హరిత విప్లవాన్ని ప్రోత్సహించిన తీరును కొనియాడారు. రాజ్యాంగ సవరణల ద్వారా అణగారిన వర్గాలకు ఆయన ఎంతో మేలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణా రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సాహితీ, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

- పాముకుంటలో విగ్రహాలకు నివాళులర్పించిన సర్పంచ్, ఉపసర్పంచ్

తొలివెలుగు, రాజపేట: మండలంలోని పాముకుంట గ్రామంలో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను జై భీమ్ ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు సర్పంచ్ రంగ నరేష్ గౌడ్, ఉపసర్పంచ్ ఎండీ షరీఫ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. దేశ ప్రగతిలో జగ్జీవన్ రామ్ చేసిన కృషి మరువలేనిదని, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన ఆశయాలు దిక్సూచి అని కొనియాడారు. యూత్ అధ్యక్షుడు పట్నం గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శేఖర్, ఏసు, యువజన సంఘం ప్రతినిధులు కరుణాకర్, రాజు, అనిల్, బాబు, శ్రీకాంత్, మోజేష్, బాలరాజు పాల్గొన్నారు.

## రాజ్యాంగ ఫలాలు అట్టడుగు వర్గాలకు అందాలి

- వలిగొండలో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు

తొలివెలుగు, వలిగొండ: దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం వలిగొండ మండల కేంద్రంలో సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ తన 45 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో కార్మిక, రైల్వే, వ్యవసాయ శాఖల మంత్రిగా విశేష సేవలు అందించారని కొనియాడారు. రాజ్యాంగ ఫలాలు నిమ్న వర్గాలకు అందేలా ఆయన అనేక చట్టాలను రూపొందించారని గుర్తు చేశారు. సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ లింగం, చిలుగురి సత్తిరెడ్డి, సాయిని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.






## కోనేరు పునరుద్ధరణకు యువత నడుం బిగింపు

- సోమారంలో స్వచ్ఛందంగా కంపచెట్ల తొలగింపు
- పురాతన చరిత్రను కాపాడుకోవాలన్నదే మా సంకల్పం: గ్రామ యువత



**తొలివెలుగు, రాజపేట:** గ్రామంలోని పురాతన సంపదను కాపాడుకునేందుకు సోమారం గ్రామ యువత ఆదర్శంగా నిలిచింది. మండల పరిధిలోని సోమారం గ్రామంలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ కోనేరు కొంతకాలంగా పట్టించుకునే వారు లేక ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఈ కోనేరు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గుర్తించిన స్థానిక యువకులు ఆదివారం స్వచ్ఛందంగా శ్రమదానానికి పూనుకున్నారు. ఉదయం నుంచే కోనేరు లోపల, వెలుపల పెరిగిన ముళ్ల కంపలను, చెత్తాచెదారాన్ని తొలగించి కోనేరుకు కొత్త రూపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, కోనేరును పునర్నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. యువత చేస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మాటూరి సంతోష్, కురుమ సంఘం అధ్యక్షుడు చిన్నం బాలరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు నారెడ్డి కమలాకర్ రెడ్డి, సతీష్ కుమార్ రెడ్డి, శివ కుమార్, అజయ్, చరణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేళ.. అభాగ్యులకు అన్నదానం

- వలిగొండలో చిన్నారి వేదాన్ష్ రెడ్డి ప్రథమ జన్మదిన వేడుకలు

**తొలివెలుగు, వలిగొండ:** ఆడంబరాలకు పోకుండా పుట్టినరోజు వేడుకలను సామాజిక సేవతో జరుపుకోవడం అభినందనీయమని రైతు హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పైల్ల మల్లారెడ్డి అన్నారు. ఆదివారం వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామంలోని సాధన మానసిక వికలాంగుల కేంద్రంలో తన మనుమడు పైల్ల వేదాన్ష్ రెడ్డి ప్రథమ జన్మదినం సందర్భంగా అన్నదానం, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. వృధా ఖర్చులకు పోకుండా ఇలాంటి అభాగ్యుల మధ్య వేడుకలు జరుపుకోవడం వల్ల ఆత్మసంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. మానసిక వికలాంగులకు, వృద్ధులకు సేవ చేయడం పుణ్యకార్యమని, ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. చిన్నారి వేదాన్ష్ రెడ్డి తల్లిదండ్రులు ప్రశాంత్ రెడ్డి-ఊర్మిళ దంపతులు ఆశ్రమ పిల్లలకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఆశ్రమ నిర్వాహకులు చిన్నారిని ఆశీర్వదించి, మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.





## వెల్లంకిలో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

**- మహనీయుల సేవలు చిరస్మరణీయం: సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్**

**తొలివెలుగు, రామన్నపేట :** భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను వెల్లంకి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో జగ్జీవన్ రామ్ పోషించిన పాత్ర మరువలేనిదని, ఆయన అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల రాజకుమార్, వార్డు సభ్యులు నకిరేకంటి నరేష్, సండ్ల లింగయ్య, జువ్వగోని మల్లమ్మ, జినుక శాంతి, మిర్యాల జగన్నాధం, మొగిలి భాగ్యలక్ష్మి, గంజి భాస్కర్, కన్నెబోయిన రాజలింగం, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళితుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్

- రామన్నపేటలో ఘనంగా 119వ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన పట్టణ కాంగ్రెస్ నాయకులు



**తొలివెలుగు, రామన్నపేట:** భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం రామన్నపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ మాట్లాడుతూ.. బీహార్‌లోని ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన జగ్జీవన్ రామ్, తన అకుంఠిత దీక్షతో జాతీయ నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. ఐదు దశాబ్దాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా దేశానికి ఆయన అందించిన సేవలు అనిర్వచనీయమని పేర్కొన్నారు. 1971 భారత్-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా దేశాన్ని విజయపథంలో నడిపించారని గుర్తుచేశారు. దళిత హక్కులు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోటే రమేష్, బొడ్డు సురేందర్ రావు, మహమ్మద్ నాసర్, కుమార్, ఆముద లక్ష్మణ్, గొరిగి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూజీ

- శోభనాద్రిపురంలో ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన సర్పంచ్ కంచి మధుసూదన్



**తొలివెలుగు, రామన్నపేట :** భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని శోభనాద్రిపురం గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్ కొనియాడారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. స్వతంత్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముక్కాముల సతీష్, చిత్రకంటి సునీత, కంచి కుమారస్వామి, కంచి స్వామి, గంగదారి పద్మ, గ్రామ పెద్దలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయుడి సేవలు అనన్యసామాన్యం!

**- చౌటుప్పల్‌లో బాబూజీ జయంతి ఉత్సవాలు**

**- పురపాలక కార్యాలయంలో నివాళులర్పించిన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం చౌటుప్పల్ పురపాలక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తన పరిపాలనా దక్షతతో అఖండ భారతావనికి ఆయన విశేష సేవలందించారని గుర్తుచేశారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బెంగళూరు వీరంగం

### చెన్నైకు వరుసగా మూడో ఓటమి

బెంగళూరు: టాపార్డర్ దుమ్మురేపడంతో... ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వరుసగా రెండో విజయం సాధించింది. ఐదుసార్లు విజేత చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 43 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (25 బంతుల్లో 70 నాటౌట్; 3 ఫోర్లు, 8 సిక్సులు), కెప్టెన్ రజత్ పాటీదార్ (19 బంతుల్లో 48 నాటౌట్; 1 ఫోర్, 6 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగగా... దేవదత్ పడిక్కల్ (29 బంతుల్లో 50; 5 ఫోర్లు, 2 సిక్సులు), ఫిల్ సాల్ట్ (30 బంతుల్లో 46; 3 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు. కొండంత లక్ష్యఛేదనలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన చెన్నై చివరకు 19.4 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటై ఈ సీజన్‌లో వరుసగా మూడో ఓటమిని మూటగట్టుకుంది. సర్ఫరాజ్ ఖాన్ (25 బంతుల్లో 50; 8 ఫోర్లు, 2 సిక్సులు) సత్తా చాటగా... కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7), సంజూ సామ్సన్ (9), ఆయుశ్ మాత్రే (1), కార్తీక్ శర్మ (6), శివమ్ దూబే (18) విఫలమయ్యారు. ప్రశాంత్ వీర్ (29 బంతుల్లో 43; 6 ఫోర్లు, 1 సిక్స్), జేమీ ఓవర్టన్ (16 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్సులు) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే పరిమితమైంది. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ 3 వికెట్లు పడగొట్టాడు.

### 10 ఓవర్లలో 91/1

ఇన్నింగ్స్ ఆరంభంలో బంతి బ్యాట్ మీదకు రాకపోవడంతో బెంగళూరు నెమ్మదిగా ఆడింది. గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లి (18 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. పవర్‌ప్లేలో వికెట్ నష్టానికి 51 పరుగులు చేసిన బెంగళూరు... సగం ఇన్నింగ్స్ ముగిసేసరికి 91/1తో నిలిచింది. కాసేపటికే సాల్ట్ కూడా అవుట్ కాగా... ఆ తర్వాత ఆర్‌సీబీ విధ్వంసం మొదలైంది.

### చివరి 5 ఓవర్లలో 97 పరుగులు

నూర్ వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో పాటీదార్, పడిక్కల్ చెరో సిక్స్‌తో 16 పరుగులు రాబట్టగా... దూబే వేసిన తదుపరి ఓవర్‌లో 23 పరుగులు వచ్చాయి. ఈ క్రమంలో 28 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న పడిక్కల్ అవుట్ కాగా... టిమ్ డేవిడ్ రాకతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఒకవైపు



పాటీదార్ సిక్స్‌ల వర్షం కురిపిస్తుంటే... మరోవైపు డేవిడ్ బౌలర్లపై యుద్ధం ప్రకటించాడు. నూర్ అహ్మద్ వేసిన 17వ ఓవర్‌లో 'హ్యాట్రిక్' సిక్స్‌లు బాదిన అతడు... తదుపరి ఓవర్‌లో 4, 6 కొట్టాడు. 28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద డేవిడ్ క్లీన్ బౌల్డ్ కాగా... అన్షుల్ వేసిన ఆ బంతి నోబాల్ కావడంతో బతికిపోయాడు. ఓవర్టన్ వేసిన 19వ ఓవర్‌లో డేవిడ్ వరుసగా 6, 2, 4, 6, 6, 6 కొట్టడంతో స్టేడియం మోత మోగిపోయింది. డేవిడ్ 21 బంతుల్లోనే హాఫ్‌సెంచరీ మార్క్ చేరాడు. చివరి ఓవర్‌లో మరో 6, 4తో బెంగళూరు ఈ సీజన్‌లో తొలిసారి 250 పరుగులు చేసిన జట్టుగా నిలిచింది. పాటీదార్, పడిక్కల్ మూడో వికెట్‌కు 21 బంతుల్లో 58 పరుగులు జోడించగా... పాటీదార్, డేవిడ్ అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 36 బంతుల్లో 99 పరుగులు జతచేశారు. బెంగళూరు చివరి 5 ఓవర్లలో 97 పరుగులు రాబట్టడం విశేషం. 202 ఐపీఎల్‌లో భువనేశ్వర్ కుమార్ తీసిన వికెట్లు. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో చాహల్ (224) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భువీ రెండో స్థానంలో ఉన్నాడు.

### స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) నూర్ (బి) దూబే 46; కోహ్లి (సి) దూబే (బి) అన్షుల్ 28; పడిక్కల్ (బి) ఓవర్టన్ 50; పాటీదార్ (నాటౌట్) 48; టిమ్ డేవిడ్ (నాటౌట్) 70; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 250. వికెట్ల పతనం: 137, 293, 3151. బౌలింగ్: ఖలీల్ 40370; హెన్రీ 30360; అన్షుల్ 40521; నూర్ 40490; ఓవర్టన్ 30421; శివమ్ దూబే 20301.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) పడిక్కల్ (బి) డఫీ 9; రుతురాజ్ (సి) పడిక్కల్ (బి) డఫీ 7; ఆయుశ్ (సి) పాటీదార్ (బి) భువనేశ్వర్ 1; సర్ఫరాజ్ (స్టంప్డ్) జితేశ్ (బి) కృనాల్ 50; కార్తీక్ (సి) అభినందన్ (బి) కృనాల్ 6; శివమ్ దూబే (సి) జితేశ్ (బి) అభినందన్ 18; ప్రశాంత్ (సి) పాటీదార్ (బి) భువనేశ్వర్ 43; ఓవర్టన్ (సి) (సబ్) బెథెల్ (బి) సుయాశ్ 37; అన్షుల్ (నాటౌట్) 19; నూర్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 8; హెన్రీ (సి) సాల్ట్ (బి) అభినందన్ 2; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 207. వికెట్ల పతనం: 19, 210, 330, 477, 584, 6108, 7165, 8178, 9190, 10207. బౌలింగ్: డఫీ 40582; భువనేశ్వర్ 40413; అభినందన్ 3.40302; కృనాల్ 30362; సుయాశ్ 40211; షెఫర్డ్ 10190;

## ప్రజాక్షేత్రంలోకి కేంద్ర పథకాలు



**- బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి**

**- రామన్నపేటలో ముగిసిన మండలాల ప్రశిక్షణ శిబిరాలు**

**తొలివెలుగు, రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి పిలుపునిచ్చారు. రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన 'దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో ఎటువంటి అవినీతి మరకలు లేని స్వచ్ఛమైన పాలన



సాగుతోందన్నారు. పంచవర్ష ప్రణాళికలో భాగంగా పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. యువమోర్చా అధికార ప్రతినిధి సతీష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి నకరకంటి మొగులయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఉపాధ్యక్షులు మైల నరసింహ, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, రాష్ట్ర నాయకులు గోలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్‌కు 'భారతరత్న' ప్రకటించాలి

- రామన్నపేటలో ఘనంగా 119వ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు



**తొలివెలుగు, రామన్నపేట:** భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి మాదిగ అన్నారు. ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక కాలం పాటు కేంద్ర మంత్రిగా వివిధ శాఖల్లో పనిచేస్తూ జగ్జీవన్ రామ్ దేశాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ మాట్లాడుతూ.. దేశానికి విశిష్ట సేవలు అందించిన జగ్జీవన్ రామ్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే 'భారతరత్న' పురస్కారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ, ఈర్లపల్లి రమేష్, నల్ల యాదయ్య, మంటి లింగస్వామి, నోముల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓంకారేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో నృత్య నీరాజనం

- లింగోటంలో భక్తిశ్రద్ధలతో ఓంకారేశ్వరుని ఉత్సవాలు
- ఆకట్టుకున్న వారాహి డ్యాన్స్ స్టూడియో చిన్నారుల నృత్య ప్రదర్శన

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఓంకారేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. వారాహి డ్యాన్స్ స్టూడియో నిర్వాహకులు ఎడ్ల హిమబిందు, సామినేని దీపికల ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అత్యంత శోభాయమానంగా నిలిచాయి. శాస్త్రీయ, జానపద నృత్యాలతో చిన్నారులు శివతత్వాన్ని చాటిచెప్పారు. భక్తి గీతాలకు అనుగుణంగా వారు చేసిన ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో తమ విద్యార్థులతో ప్రదర్శనలు ఇప్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# అనసూయ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్!?



ఒక్కసారిగా అనసూయ మళ్ళీ హాట్ టాపిక్ అయింది. అందుకు ప్రధాన కారణం ఓ వీడియో సాంగ్. ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వోల్ఫ్' మళ్లీ వార్తల్లో నిలిచింది. 2023 ఆగస్టులో టీజర్‌ను విడుదల చేసిన ఈ చిత్ర బృందం, ఇన్నాళ్ల విరామం తర్వాత తాజాగా ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. తాజాగా విడుదలైన "సాసా సాసా" అనే తమిళ లిరికల్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ పాటలో ప్రభుదేవా తన సొగసైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటూ కనిపిస్తారు. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న హీరో జీవితంలో ముగ్గురు అందమైన యువతులు ఒక్కొక్కరిగా ప్రవేశించడం, వారంతా చాటుగా మొబైల్‌లో వీడియోలు తీయడం, హీరోను ఆటపట్టించడం వంటి రొమాంటిక్ సన్నివేశాల మధ్య ఈ పాట సాగుతుంది. మెలోడీకి తోడు స్టైలిష్ విజువల్స్, ప్రభుదేవా ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్‌గా మారాయి. ఇప్పటికే ఈ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్ యువతలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రెజెంటేషన్‌లో ఉన్న క్లాస్ టచ్, సంగీతంలో ఉన్న మోడర్న్ బీట్‌లు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. అయితే అనసూయ భరద్వాజ్ ఇలాంటి సాంగ్‌లో నటించడం కొంతమందిని ఆశ్చర్యపరిచింది. ఆమె ఓ తాంత్రికురాలి పాత్రలో కనిపించబోతున్నారని, ఆ రోల్ హర్రర్%-%రోమాన్స్ మిక్స్‌గా ఉంటుందని సమాచారం. అయినా, నెటిజన్లు "ఇలాంటి పాత్రలో అనసూయ ఎందుకు నటించింది?" అంటూ సోషల్ మీడియాలో విభిన్న కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది ఆమెపై వ్యంగ్యంగా ట్వీట్లు చేస్తుండగా, మరికొందరు మాత్రం ఆమె కొత్త ప్రయోగాన్ని మెచ్చుకుంటున్నారు. ఏదేమైనా, "సాసా సాసా" పాటతో ఈ సినిమా మీద మళ్లీ చర్చ మొదలైంది.వినూ వెంకటేష్ దర్శకత్వంలో రూపొందిన 'వోల్ఫ్' చిత్రం ప్రభుదేవా కెరీర్‌లో 60వ సినిమాగా నిలవబోతోంది. సందేశ్ నాగరాజు, సందేశ్ ఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే తమిళంతో పాటు తెలుగు మరియు ఇతర భాషల్లో విడుదల కానుంది.





# ఏకే 64లో లారెన్స్, విజయ్ సేతుపతి?


తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం 'ఏకే 64' గురించి మరో కీలక అప్డేట్ బయటకు వచ్చింది. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్నఈ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్ కోసం గణనీయమైన బడ్జెట్‌ను కేటాయించినట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్‌తో పాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా కీలక పాత్రల్లో నటించబోతున్నారు.వారు విజయ్ సేతుపతి,రాఘవ లారెన్స్. అయితే వీరిద్దరూ ప్రతినాయకులుగా నటిస్తున్నారా? లేక అజిత్‌కు అండగా నిలిచే శక్తివంతమైన పాత్రల్లో వస్తారా?అన్నది చిత్రయూనిట్ ఇంకా వెల్లడించలేదు. కానీ ఇండస్ట్రీ వర్గాల మాటల ప్రకారం, వీరి రోల్స్ మల్టీ-డైమెన్షనల్‌గా ఉండనున్నాయని,కేవలం ప్రతినాయక పాత్రలుగా మాత్రమే కాకుండా కథలో ప్రధాన మలుపులకు కారణమవుతారని సమాచారం. ఇటీవల 'వాలిమై', 'వీర్‌మా', 'తునివు', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాలతో వరుస హిట్లు అందుకున్న అజిత్ ఈసారి మరింత స్టైలిష్, మాస్, అలాగే ఎమోషన్ కలగలిపిన పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాను ఎంచుకున్నారని తెలుస్తోంది. జనవరిలో ఈ సినిమా సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని అజిత్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ సినిమాకి దేశంలోనే అగ్రశ్రేణి టెక్నీషియన్లు, యాక్షన్ మాస్టర్లు, డీఓపీ లు కలిసి పనిచేస్తున్నట్టు సమాచారం. అలాగే ఈ ప్రాజెక్ట్ కోసం అజిత్ తన కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్నారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక రాఘవ లారెన్స్ ప్రస్తుతం 'కాంచన 4' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. పూజా హెగ్డే, నోరా ఫతేహి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే పాజిటివ్ టాక్‌ను సంపాదించుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో వరుస సినిమాలతో శరవేగంగా దూసుకెళ్తున్నారు. 'ఏకే 64' లో అజిత్, విజయ్ సేతుపతి, రాఘవ లారెన్స్ ఒకే తెరపై కనిపిస్తే.. అది కేవలం కోలీవుడ్‌కే కాదు, పాన్ ఇండియా స్థాయిలోనే అత్యంత భారీ, క్రేజీ కాంబినేషన్ గా నిలుస్తుందని సినీ విశ్లేషకుల అభిప్రాయం.

# పవన్ కళ్యాణ్‌తో 'బ్రో 2'..

## పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నలే తరువాయి



పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ నటించిన 'బ్రో' సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. అయినప్పటికీ, దర్శకుడు సముద్రఖని 'బ్రో 2' తీయడానికి సిద్ధంగా ఉన్నానని, పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే సినిమా పట్టాలెక్కుతుందని ప్రకటించారు. ఈ వార్త పవన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. 'ఓజీ 2' వంటి భారీ ప్రాజెక్టులున్న నేపథ్యంలో 'బ్రో 2' అవసరమా అని చర్చలు మొదలయ్యాయి.పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ కాంబినేషన్‌లో వచ్చిన ఫాంటసీ కామెడీ సినిమా 'బ్రో'. ఇది మామా అల్లుళ్లు కలిసి నటించిన ఫస్ట్ మూవీ. 'వినోదయ సితం' అనే తమిళ సినిమాకి ఇది రీమేక్. మాతృకను డైరెక్ట్ చేసిన సముద్రఖని.. కొన్ని మార్పుల చేర్పులతో తెలుగులో తెరకెక్కించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దీనికి స్క్రీన్ ప్లే అందించారు. 2023 జులై నెలాఖరున రిలీజైన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర నిరాశ పరిచింది. పవర్ స్టార్ అభిమానులకు కూడా ఈ సినిమా నచ్చలేదు. అందుకే కలెక్షన్స్ రాలేదు. అయితే అలాంటి చిత్రానికి సీక్వెల్ చేయడానికి స్క్రిప్ట్ రెడీ అయింది.అవును.. మీరు విన్నది నిజమే. 'బ్రో 2' సినిమా చేయడానికి డైరెక్టర్ కమ్ యాక్టర్ సముద్రఖని సిద్ధంగా ఉన్నారు. తమిళంలో తీస్తారో లేదో తెలియదు కానీ.. తెలుగులో మాత్రం పవన్ కళ్యాణ్ తోనే ఈ సీక్వెల్ తీయాలని ఫిక్స్ అయిపోయారు. దీనికి కథ కూడా సిద్ధంగానే ఉంది. పవన్ ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, అప్పుడు సినిమాని పట్టాలెక్కించాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని సముద్రఖని స్వయంగా మీడియా ముఖంగా వెల్లడించారు. 'బ్రో' మూవీకి సీక్వెల్ ఉంటుందని కన్ఫామ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రలు పోషించిన 'కాంత' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి దుల్కర్, రానా, భాగ్యశ్రీ లతో పాటు సముద్రఖని కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'బ్రో 2' మూవీ ప్రస్తావన వచ్చింది. దీనిపై సముద్రఖని స్పందిస్తూ.. "బ్రో 2' స్క్రిప్టు రెడీగా ఉంది. అన్నగారు సిగ్నల్ ఇస్తే టేకాఫ్ అవుతుంది" అని అన్నారు.బ్రో 2' సినిమా స్క్రిప్ట్ రెడీ అని సముద్రఖని ప్రకటించడంతో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అంతా ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యారు. ఒకింత షాక్ అయ్యారని చెప్పాలి. ఎందుకంటే ఇది వారు ఊహించని అప్డేట్. 'బ్రో' కమర్షియల్ గా పెద్దగా వర్కౌట్ కాలేదన్నది ఓపెన్ సీక్రెట్. ఏదో పవర్ స్టార్ ఇమేజ్, స్టార్ డమ్ కారణంగా మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. కానీ కంటెంట్ పరంగా చూసుకుంటే మాత్రం సాధారణ ప్రేక్షకులతో పాటుగా అభిమానులని కూడా అంతగా మెప్పించలేకపోయింది.



# తారక్ లో మార్పు సినిమా కోసమేనా?

గతకొన్ని రోజులుగా టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ అభిమానులు సోషల్ మీడియాలో చర్చల్లో మునిగిపోయారు. దానికి ప్రధాన కారణం ఆయన కొత్త లుక్! ఇటీవల తారక్ హాజరైన కొన్ని ఈవెంట్లలో ఆయన లుక్స్ వైరల్ అయ్యాయి. అందులో ఆయన చాలా సన్నగా కనిపించారు. దీనిని చూసి ఫ్యాన్స్? ఆశ్చర్యపోతూనే కొంత ఆందోళన కూడా వ్యక్తం చేశారు. చాలామంది సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో "ఎందుకు తారక్ ఇంత లీన్‌గా కనిపిస్తున్నారు?" "ఈ మార్పు సినిమా కోసమేనా?" అంటూ కామెంట్లు చేస్తున్నారు.ప్రస్తుతం తారక్ ప్రశాంత్?నీల్?తో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం లుక్ మార్చుకుంటున్నారు. ఇందులో తారక్ లుక్‌పై ప్రశాంత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా అదిరే అప్డేట్ ఇచ్చారు. తారక్ లుక్?ను దగ్గరుండి డిజైన్ చేయించుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఓ ఫొటోను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. ఇందులో ప్రశాంత్ పర్యవేక్షనలో డిజైనర్ తారక్ లుక్?ను ట్రిమ్ చేస్తున్నారు. అలాగే త్వరలోనే ఇంకో షెడ్యూల్ షురూ కానున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త పాత్రలో కనిపించనున్నారని సమాచారం. అతని స్టైలింగ్, బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ ఈ సినిమాకే పరిమితమని టీమ్ చెబుతోంది. అభిమానులు కూడా ఇప్పుడు ఈ కొత్త లుక్ వెనక దాగి ఉన్న సర్‌ప్రైజ్ ఏమిటో తెలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.